



కొబ్బరి తోటలో సీరెండ దోబూచులాడుతోంది మేదరివాడు అల్లిన చాపలా గళ్లు గళ్లుగా ఎండ కొబ్బరి ఆకుల సందుల్లోంచి నేలమీద పడుతోంది. గెలల నుంచి రాల్చిన కొబ్బరి బొండాలు రాసి పడి గుట్టతేలేయి. దాపులోనే ఆగివున్న లారీ క్రింద పడుకొని కొబ్బరి గెలల్ని మోసుకొస్తోన్న అమ్మాయిల వొంటి బిగువుల్ని కళ్ళతో కొలతలు వేస్తున్నాడు డ్రైవరు పానకాలు లారీ కెడమప్రక్కగా పనివాళ్ళు కొబ్బరిబొండాల తొక్కని చెక్కి లారీలోకి విసురుతున్నారు

అదంతా ఏమీ పట్టనట్లుగా కాస్త ఎడంగా వున్న కుక్కిమంచంలో దిగాలుగా కూచుని వున్నాడు సింహాచలం. ఆలోచనలతని బుర్రని తొలిచివేస్తూన్నాయి పనివాళ్ళతని కనుగప్పి ప్రక్కనే వున్న గోనె బస్తాల్లో పీచుకు బదులు కాయల్ని నింపుతూనే వున్నారు అతని పరాకు నదనుగా తీసుకొని ఓ నాలుగు బస్తాల కాయలు పీచు రూపంలో తోటని దాటి వెళ్ళేయి మనసులో మనసులేని సింహాచలం యివన్నీ గమనించే స్థితిలో లేడు. అతని మనసునిండా మంగళగిరి నృసింహస్వామి దివ్యస్వరూపమూ, తను ఆయన కిపుడు కట్టవలసిన ముడుపుని గురించిన ఆలోచనలు మాత్రమే నిండి వున్నాయి

లారీ క్రిందనుంచి యివతలికొచ్చి వాగన్‌లోకి తొంగిచూచేడు పానకాలు అది యింకా నిండకపోవటాన్ని గమనించి బీడీ వెలిగించేడు పాతిక గజాల దూరంలో బొండాన్నెత్తి పట్టుకుని నీళ్ళు త్రాగుతోంది లచ్చి రెండు చేతుల్నీ పైకెత్తి బొండాంలోని నీళ్ళని త్రాగుతూన్న దాని తడిసిన గుండెల ఎత్తు పల్లాలు పానకాలు నరాల్ని జివ్వున లాగేయి ఖాళీ బొండాన్ని దూరంగా విసిరి చీరకొంగుతో మూతిని తుడుచుకుంటూన్న లచ్చికి కన్నుగీటి దాపులోని పాకవంక అడుగులేసేడు పానకాలు వొళ్ళు విరుచుకుంటూ సిగ్గు లొలకబోసింది లచ్చి చెట్టుక్రింద రాలిన బొండాంల్లోంచి పెద్దసైజు దాన్నొకటి ఏరి పట్టుకుని పానకాలు వెళ్ళినవైపు పరుగుతీసింది

చెట్టు నెక్కి గెలల్ని రాలుస్తోన్న కనకయ్య కనుకొలుకుల్లో నీళ్లు నిలిచేయి లచ్చి పాకలోకి అడుగువేయటం చూచి, అప్పటికే పాకలో వున్న పానకాల్ని



గురించి ఊహించుకోగానే అతని గుండె బరువెక్కిపోయింది.

కుక్కిమంచంలో కూచుని వున్న సింహాచలం కూడా ఆ దృశ్యాన్ని గమనించేడు. ముడుపు విషయం ఆలోచించటాన్ని ఓ క్షణం మానుకుని కనకయ్య వంక సానుభూతిగా చూచేడతను. అతనికా క్షణంలోనే లచ్చి, కనకయ్యల పాతకాపురంనాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి.

లచ్చి, కనకయ్యని కోరి పెళ్ళాడింది. మొదట్లో యిద్దరూ జోరుగా తిరిగేరు. కళకళ్ళాడుతూ తోటలంతా వేళాపాళా లేకుండా తిరుగాడుతూ వుండే ఆ జంటని చూచిన వయసుమళ్ళిన వాళ్ళలో కూడా కోరికల గుర్రాలు పరుగులు తీసేవి. కొబ్బరి తోటలే తమ యిళ్లుగా, పచ్చగడ్డే తమ పానుపుగా, బొండాలతోనే ఆకల్నీ దాహాన్నీ తీర్చుకుంటూ, వయసూ పరువాల అలజడిని అణుచుకుంటూ తిరుగాడిన ఆ జంట నలుగురి కంటికీ యింపుగా వుండేది. కాని గత సంవత్సరం యిదే శేషాద్రిగారి తోటలోని కాయల్ని రాలుస్తూన్నప్పుడు కాస్తా కాలుజారి చెట్టుపై నుంచి నేలకూలేడు కనకయ్య. చెట్టు ఎత్తైంది కాకపోవటంతో వొంటికైతే ఏ హానీ కలుగలేదు కానీ మనిషన్నవాడికి కావలసిన మగసిరిని మాత్రం కోల్పోయాడు. దాంతో లచ్చి గుణం కాస్తా మారిపోయింది. కనకయ్య కళ్లు కప్పి పానకాలుతో కాలు జారింది. కొన్నాళ్ళకి కనకయ్య కళ్ళు తెరుచుకున్నాయి. కాని

పరువుకోసం తిరిగి మూసుకున్నాడతను. అది ఆసరాగా తీసుకుని యిహ అతడి ముందే నేరుగా వ్యవహారం మొదలెట్టింది లచ్చి. తోటలోని వొంటరి సంసారం కావటంతో గుట్టు రచ్చకెక్కలేదు కానీ కనకయ్య గుండెల్లో అంటుకున్న మంటలు మాత్రం రగులుకుంటూనే వున్నాయి.

సింహాచలం ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. అతడిలో తిరిగి ముడుపుని గురించిన ఆందోళన ఆవరించుకుపోయింది.

కాని చెట్టుపై నున్న కనకయ్య గుండె లవిసిపోయేయి. ఇలా పట్టపగలే నలుగురున్నారని కూడా చూడకుండా వాళ్ళిద్దరూ అలా పాకలో దూరటంతో కలిగిన అశాంతితో మనసు వశంతప్పి పిచ్చిగా గెలల్ని తెగవేయసాగే డతను.

"ఏరా కనకయ్యా! వొళ్లు పొగరెత్తిందేవిటి? కళ్ళు కనిపించటంలా? పసిపిందెల్నలా రాలుస్తున్నావేవిటీ?" క్రింది నుంచి శేషాద్రిగారి గొంతు వినటంతోనే కనకయ్య కరచేతుల్లో చెమటలు పోసేయి. వంకీ కత్తి పట్టుదప్పి చేయి జారింది.

సూదిమొన మేరలో ప్రమాదాన్ని తప్పించుకున్న శేషాద్రిగారి కళ్ళలో రక్తం పేరుకుపోయింది. ఒళ్ళుమరచిన కోపంతో గావుకేక వేసేరాయన.

"దిగూ!"

కనకయ్య పైప్రాణాలు పైనే లేచిపోయేయి. కంగారుగా దిగబోతూంటే కాలు కాస్తా జారిపోయింది. కుప్పలా నేల కూలిన వాడి తొడ ఎముక కరకరమంది. బాధని పళ్ళమధ్య బిగిస్తూ తన తలనెత్త డతను. కాని అంతలోనే శేషాద్రిగా చేతిలోని పొన్నుకర్ర కాస్తా వాడి అ తలపై విసురుగా పడిపోయింది. దాంతో కుక్కినపేనల్లే నేలకొరిగేడతను.

క్షణంలో తోటంతా సద్దుమణిగిపోయింది.

సింహాచలం కుక్కిమంచంలోంచి లేచి వచ్చేడు.

"బాబుగారూ! వెంకటేశుకెలావుంది?" సింహాచలం ప్రశ్నని వింటూనే శేషాద్రి గారి ఆగ్రహం కాస్త తగ్గుమొహం పట్టింది.

"మళ్ళీ జ్వరం రాలేదు సింహాచలం! నేనీ పనుల్ని చూసుకోగలనంటే విన్నావు కాదు. అక్కడ వాడేమో నిన్నే కలవరిస్తున్నాడు. ఇహనయినా ఈ పనులాపి త్వరగా ఇంటిమొహం పట్టు? నేనలా పేటదాకా వెళ్ళి రెండు గంటల్లో వస్తాను. డాక్టర్‌గారిని కూడా కలిసేవస్తాను. వెళ్ళే ముందా కనకయ్యగాడికేమయిందో చూసి మరీ వెళ్ళు!" అంటూ లారీ వంక అడుగు లేసే రాయన.

"కనకయ బావా! ఓ కనకయ్య బావా!" పిలిచేడు సింహాచలం, కాని వాడు కళ్ళు తెరవకపోవటంతో వాడి గుండెలపై చేయి వేసేడతను. ఆ వెంటనే ఓ బొండాన్నందుకుని ప్రక్కనే పడివున్న వంకీకత్తితో తొక్కని చెక్కి నీటిని వాడి మొహంపై చిలకరించేడు.

పాకలోంచి నలిగిన చీరని సద్దుకుంటూ కిలకిలా నవ్వుతూ యివతలికి వచ్చిన లచ్చి తోటలోని నిశ్శబ్దాన్ని భంగపరిచింది.

వాని వెనకాలే వెన్నువిరుచుకుంటూ యివతలికొచ్చిన పానకాలు, లారీవద్ద నుంచుని తమ వంకే చూస్తూన్న శేషాద్రి గారిని చూసి జడిసి ఓ అడుగు వెనక్కేసేడు.

శేషాద్రిగారికి విషయం బోధపడింది. ఇబ్బందిగా దృష్టిని కనకయ్యవంక మళ్ళించేరాయన.

స్పృహలోకి వచ్చిన కనకయ్య ఆయన వంక బేజారుగా చూస్తూ చేతుల్ని జోడించేడు. అది చూచి శేషాద్రిగారి గుండెలు క్షణం చలించేయి. దిగ్గున వెనుదిరిగి వెళ్ళి లారీ కేబిన్ తలుపు తెరిచి భళ్ళమంటూ మూసుకున్నారాయన

పానకాలు పరుగెత్తుకుని వచ్చేడు కేబిన్ తలుపు తీసి లోనికి చూట్టంతోనే వాడి గొంతారిపోయింది. ఎర్రగా వెలుగుతూన్న చుట్టని కసిగా కొరుకుతూ అతడి వంకే తీక్షణంగా చూస్తున్నారు శేషాద్రి గారు వారి చూపుల్ని తప్పించుకోవటానికి కేదారీ తోచక గభాలున లోనికి దూకి లారీని ముందుకి దూకించేడు పానకాలు.

సింహాచలం కనకయ్యని లేవనెత్తేడు. వాడికేం జరిగిందో తెలియని లచ్చి నంగనాచిలా వచ్చి మొగుణ్ణి చూస్తూనే గొల్లుమంది.

నాలుగు వెదురుబద్దల్ని వాడి తొడకి నాలుగువేపులా అమర్చి, తోటంతా వెతికి తెచ్చిన ఆకుల్ని వాటి చుట్టూ పేర్చి త్రాటితో గట్టిగా బిగించేడు సింహాచలం. నలుగురు మనుషుల్ని పిలిచి సాయం పట్టించి వాణ్ణి పాకవంక పంపించేడు. మొగుడి వెనకాలే శోకాలు పెడుతూ వెళ్ళింది లచ్చి.

పరిసరాలు ప్రశాంతంగా మిగిలిపోయే సరికి సింహాచలం మనస్సు మళ్ళీ అల్లకల్లోలమయింది. "దేవుడికి ముడుపునెలా కట్టేది?" గొణుక్కోసాగేడతను. అలా గొణుక్కుంటూనే పనివాళ్ళని ఇళ్ళకు వెళ్ళండంటూ పురమాయించి రాసిపడిన కాయలకి హద్దునేర్పాటుచేసుకుని పాకలోని లచ్చినీ, కనకయ్యనీ వాటి కాపలాకి హెచ్చరించి ఇంటిమొహం పట్టేడు.

శేషాద్రిగారి భవంతి నిశ్శబ్దంగా వుంది. నడవాలో శేషాద్రిగారు పెంచుకుంటూన్న కుక్కపిల్ల ముడుచుకుని పడుకుని వుంది లోగిలిలో చాకలి రత్తి వేసివెళ్ళిన ముగ్గులోని పిండిని కోళ్ళు ఆత్రంగా మేస్తున్నాయి. దాపులోని పూలమొక్కల్ని మేస్తోన్న మేకపిల్లొకటి అలికిడి విని పరుగుదీసింది హాల్లో ఎదురుగా వున్న వాలుకుర్చీలో తెల్లపిల్లి మత్తుగా నిద్రపోతోంది.

సింహాచలం గదిలోకి అడుగువేయటం చూచి వెంకటేశుని వళ్ళోంచి దింపి లేచి నుంచుంది వంటమనిషి సీతాలు.

"నీ కెన్నిసార్లు చెప్పాలే సీతాలూ? వాణ్నలా దగ్గరికి తీసుకోవద్దనీ!"

"ఏటిసేసేది సిమ్మాచలం? ఆడి వొల్లు పేలిపోతావుండాది. ఎత్తుకుని కోక ముక్కెట్టి యిసరతావుంటే కాస్త కునుకు పట్టింది!"

"నీ మొహం! అదేవిటో వాణ్ని ఆ మంచంలోనే వుంచి ఏడవరాదూ? సర్లే! యిహ వెళ్ళి నీ పని చూసుకో!"

తలాడిస్తూ కదిలివెళ్ళింది సీతాలు

తడిగుడ్డని చన్నీళ్ళలో ముంచి కొడుకు

నుదురు నద్దుతూ వుండిపోయేడు సింహాచలం. కట్టవలసిన దేవుడి ముడుపు విషయం జ్ఞాపకంరాగానే అతని గుండెలు బరువెక్కిపోయేయి. ఆ వెంటనే గతం అతని స్మృతిపథంలో మెదిలింది.

* * *

సింహాచలం బల్లకట్టుమీద వున్నాడంటే చాలు! రేవుని త్వరగా దాటొచ్చునని ఆ ప్రాంతంలో ప్రతీతి. ఓరోజు అదే బల్లకట్టుమీద వున్న శేషాద్రిగారి కతని ప్రజ్ఞ ముచ్చటవేసింది అభినందించబోయి వెనుకాడి తోచక సింహాచలం ప్రక్కనే వున్న రెండేళ్ళ కుర్రాణ్ని గురించి ప్రశ్నించేరాయన. తల్లిలేని తన పిల్లవాడి గురించి అంతపెద్దమనిషి పరామర్శించేసరికి సింహాచలం కరగిపోయేడు వారడక్కముందే తన గోడునంతా వారికి చెప్పుకుని సీరుకారిపోయేడు. అంతా విని దిగిపోయేముందిలా అని సమాధానాన్ని కూడా ఆశించకుండా చక్కాబోయేరు శేషాద్రిగారు

"మరిలా ఆ పసివాడితో ఈ బల్లకట్టు బ్రతుకెందుకోయి సింహాచలం? మా తోట కాపలాకి నాకో మనిషి కావాలి వచ్చెయ్!"

సింహాచలం ఆ విషయాని కాక్షణంలో అంత ప్రాముఖ్యాన్ని యివ్వలేకపోయేడు అతని కప్పట్లో బల్లకట్టుని వదిలే ఉద్దేశ్యమే లేదు పైగా ఆయన ఖచ్చితంగా చెప్పివెళ్ళినట్లూ లేదు కాని ఓరోజు బల్లకట్టు పైనుంచి దొర్లి సీటిలో పడిపోయి కొన ఊపిరితో బయటపడిన వెంకటేశుని చూడగానే అతనికా రేవుతో రుణం తీరిపోయింది.


సింహాచలం తమ లోగిల్లోకి అడుగుపెట్టటంతోనే హాల్లోని వాలుకుర్చీలో చేరగిలబడిపోయి యెర్రగా వెలుగుతోన్న చుట్టని కొరుకుతూన్న శేషాద్రిగారు చిరునవ్వు నవ్వేరు

"నీవు వస్తావని నాకు తెలుసోయి సింహాచలం! వెళ్ళు' వెళ్ళి మన తోటలో పాకవేసుకునుండు' అందుక్కావలసిన సరంజామా అంతా పానకాలు చేత జాబితా వేయించు!"

అంత త్వరగా తన కాశ్రయం లభిస్తుందనుకోలేదు సింహాచలం శేషాద్రిగారు కూడా భార్యా విహీనుడనీ, ఆయనకూ తనలాగే తల్లిలేని పసివాడొహాడున్నాడనీ అపుడే తెలిసిందతనికి తన యిబ్బందిని అనుభవపూర్వకంగా అర్థం చేసుకుని తనకి ఆశ్రయాన్నిచ్చిన వారి అభిమానాన్ని పెంపొందించుకోవటమే తన ధ్యేయంగా భావించేడతను

దాంతో వున్న కొబ్బరి చెట్లు కాస్తా నిగ్గుతేరి, కొత్త మొక్కలు నాటుకొని తోటంతా విస్తరించి క్రొత్తందాల్ని సంతరించుకుంటూ వస్తే, మరోవైపు ఆడదిక్కులేని శేషాద్రిగారింట ఆ లోపలే లేనట్లుగా వారిలోగ్గిల్లో కళ్ళాపి తడుస్తూ, రంగవల్లులు వెలుస్తూ వచ్చేయి అటు తోటనీ, యిటు ఇంటినీ, అటు చినబాబునీ కంటికి రెప్పల్లా కాపాడుకుంటూ వచ్చిన సింహాచలం అచిరకాలంలోనే శేషాద్రిగారి హృదయంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగేడు.

కాని విధి శేషాద్రిగారిని చిన్న చూపు చూచింది. చినబాబుకేదో గాలి సోకటంతో వాడి అస్వస్థత శృతిమించి శేషాద్రిగారిని మానసికంగా చిత్రవధ చేసింది మొదట్లో




తన భార్యనీ, యిపుడు తన కొడుకునీ తమనించి ఆ జాలిలేని దేవుడు వేరు చేయటానికి పూనుకున్నాడని వాపోయేరాయన. దాంతో యజమాని నా స్థితిలోవుంచి తను తోటలో వుంటం మనసొప్పక కనకయ్యని తోట కాపలాకి నియమించి తన మకాంని వారింటికే మార్చేడు సింహాచలం.

పదిరోజులు గడిచినా చినబాబు స్థితి మెరుగు పడలేదు పేటనుంచి పేరుమోసిన డాక్టరు గారు ప్రతిరోజూ వచ్చి వెడుతూనే వున్నాడు. మరో వైపు మంత్రాలనీ, పూజలనీ అన్ని తతంగాలూ లోపరహితంగా జరుగుతూనే వున్నాయి కాని ఫలితం మాత్రం కనిపించకపోవటంతో, పిల్లవాడి తాపాన్నీ, బాధనీ గమనిస్తూ అటు శేషాద్రిగారూ యిటు సింహాచలమూ తల్లడిల్లిపోయేరు

ఓ రోజు రాత్రి ఏ ప్రమేయమూ లేకుండానే సింహాచలం మనస్సులో మంగళగిరి స్వామి మెదిలేడు దాంతో శేషాద్రి గారి నా దేవుడికి ఓ వంద రూపాయల ముడుపు కట్టండంటూ కూచున్నాడతను.

కాని శేషాద్రిగారందులకు వ్యతిరేకించేరు. కొడుకు నా స్థితిలో చూస్తున్న వారికి దేవుడిలో నమ్మకంపోయింది. దేవుడ సేవాడిపై ద్వేషాన్ని పెంచుకుంటూ వచ్చేరాయన సింహాచలం ఎంత బలవంతం చేసినా ఆయనందులకు అంగీకరించక పోవటమే కాకుండా అతనిపై విసుక్కున్నారాయన

"దేవుడూ లేడు! దైవమూలేడు! ముడుపూ వద్దు! ముళ్లేవద్దు! నన్నాట్టే విసిగించకు! ఎలా జరగాల్సుంటే అలాగే జరుగుతుంది "

కాని సింహాచలానికి మాత్రం ఆ దేవుడి మీద నమ్మకం వుంది. చినబాబు పేర ముడుపు కడితే అతడికి తప్పక నయమవుతుందని అతని విశ్వాసం కాని అశక్తుడిగా వుండిపోయేడతను

సింహాచలం అలా దేవుడి మీద భక్తితో భయపడుతూ వుంటే శేషాద్రి

గారు విరక్తితో దినమంతా గడిపారు.

ఆ రాత్రే చినబాబు కీ ప్రపంచంతో రుణం తీరిపోయింది

* * *

మంచంలో వెంకటేశు కదిలేసరికి గతంలోంచి ప్రస్తుతంలోకి వచ్చేడు సింహాచలం తనకొడుకు వెంకటేశుకి కూడా చినబాబులాంటి గాలే సోకేసరికి అతని నవనాడులూ కృంగిపోయాయి. దేవుడు శేషాద్రిగారికి చేసిన అన్యాయం లాంటిదే యిపుడు తనకి కూడా చేయ కూడదనే భయం కలిపించిన కంగారులో ఆ దేవుణ్ణే స్మరిస్తూ అనాలోచితంగా నాలుగొందలయినా తెచ్చి ముడుపు కడతానని అనేసాడతను కాని ఆ అన్నాక తను పలికిన మొత్తం జ్ఞాపకం వచ్చేసరికి అతని గుండెలు బేజారెత్తిపోయేయి. కడతానన్న ముడుపుని వెంటనే కట్టక పోతే వెంకటేశుని తనకా దేవుడు దక్క నీయడేమోనన్న భయం సింహాచలాన్ని పదిహేను రోజులుగా చిత్రవధ చేస్తున్నది. అంత పెద్ద మొత్తాన్ని ఎలా సమకూర్చాలో అతనికి తెలిసిరావటంలేదు. శేషాద్రిగారరంత డబ్బు నందిస్తారన్న నమ్మకమూ లేదు. ఏ దారీ తోచక మనసులో చికాకునీ, గుండెల్లో మంగళగిరి స్వామిపై భయాన్నీ నింపుకుని సతమతమవుతున్నాడతను.

వీధిలో లారీ చప్పుడు వినిపించేసరికి సింహాచలం ఆలోచనలు పటాపంచలయ్యేవి. నిద్రలోకి జారిన వెంకటేశుకి దుప్పటిని సవరించి నడవాలోకి నడిచేడతను. లోగిలిరోనుంచి హాల్లోకి అడుగు పెట్టబోయిన శేషాద్రిగారు వెనుదిరిగి చూచేరు.

"ఎలా వుంది?"

"నిద్రలో వున్నాడండి!"

"నిద్దరోతేనే మంచిదన్నారు డాక్టరుగారు తగ్గిపోతుందిలే సింహాచలం! కంగారుపడకు· ఆయన మందులేవో రాసిస్తే పట్టుకొచ్చాను. వాడు లేచాక వేయాలవి!" అంటూ తమ గదిలోకి వెళ్ళిపోయేరాయన.

సింహాచలం వంటగదివైపు నడిచేడు. సీతాలు కోడిగుడ్ల పులుసు చేస్తోంది కాబోలు, తొక్క తీసిన గుడ్లని గిన్నెలో వేసి కలుపుతోంది

"బాబుగారొచ్చేరు త్వరగా కానివ్వు!" అంటూ స్నానంకోసం బావి వంక వెళ్ళేడు సింహాచలం.

రాత్రి తొమ్మిదయింది కొడుకుదగ్గరే కూచుని ముడుపు డబ్బుని గురించి తలని బ్రద్దలుకొట్టుకుంటోన్న సింహాచలాన్ని భోజనానికి కేకేసింది సీతాలు

తలెత్తేడు సింహాచలం. గడపలో నుంచునివున్న సీతాలు అప్పుడే స్నానం చేసినట్లుంది. సన్నగా తలని దువ్వుకుని వుంది బొట్టొకటే లోపం. నలభై ఏళ్ళ సీతాలు, దీపం వెలుగులో ముప్ఫయిఏళ్ళ దానిలా కనిపిస్తోంది. దాని చీకటివేళ సింగారం అర్థంకాని సింహాచలం తనవంకలా చూస్తోంటే సీతాలు వింతగా చూచింది

"బాబుగారు భోంచేసారా సీతాలూ?"

"ఇంకాలేదు. సీసాముందెట్టుక్కూసు న్నారు నన్నుణ్ణం తెచ్చి ఆరి గదిలో పెట్ట




ల్లమన్నారు. మరి నువ్వొచ్చి కానీ!"

సింహాచలం లేచేడు. వెళ్ళి నాలుగు ముద్దలు మ్రింగి వచ్చి కొడుకు మంచం ప్రక్కనే పడకవేసేడు. ఆలోచనలత న్నింకా సతమతం చేస్తూనే వున్నాయి. వెంకటేశు నిద్రలో వుంటంతో మెద డతని ఆలోచనలకి ఆనకట్టవేసింది. సింహాచలం కూడా నిద్రలోకి జారి పోయేడు.

గోడగడియారం పన్నెండు సార్లు మ్రోగడంతో మేలుకున్నాడు సింహాచలం. కొడుకువంక చూడటంతోనే అతని నోట తడారిపోయింది. జ్వరమైకంలో మంచంలో ఎగిరిపడుతూన్నాడు వెంకటేశు. వాడి వొళ్ళు ముట్టుకుని చూచే డతను. కంచులా కాలిపోతోందది. తండ్రి స్పర్శకి కళ్ళు తెరిచి మంచినీళ్ళు కావా లన్నట్టుగా చూచేడా పసివాడు.

సింహాచలం గుండెల్లో రైళ్ళు పరుగు దీయటం ప్రారంభించేయి. దిగ్గున లేచి పోయి గ్లాసుని బిందెలో ముంచబోతూం డగా అతనికి శేషాద్రిగారు చెప్పిన మందుల విషయం జ్ఞాపకం వచ్చింది. వెంకటేశు గొంతుని తడిపి దుప్పటిని సవరించి నడవాలోకి వచ్చేడతను.

శేషాద్రిగారి గది దాపులోకి రాగానే సింహాచలం ఆగిపోయేడు. గదిలో గాజులు గలగల్లాడుతూంటం వినిపించటంతో ఆశ్చర్యపోయేడతను. ఆసక్తిగా కిటికీ సందుల్లోంచి చూచిన అతని వదనం పాలి పోయింది.

గదిలో శేషాద్రిగారి నోటిలో చుట్ట ఎర్రగా వెలుగుతోంది. వారి దృష్టి తమ కెదురుగా నుంచుని చీరని విప్పి పోగు పెడుతోన్న సీతాలుపైన వుంది.

గ్రరున వెనుదిరిగేడు సింహాచలం.

అంతక్రితం సీతాలు చేసుకున్న సింగార మెందుకో తెలిసివచ్చిందతనికి. గత సాయంకాలం తోటలోని లచ్చి వ్యవహారాన్ని చూడగానే శేషాద్రిగారిలో కూడా పురుగు దూరిందన్నమాట! ఆయనకి వత్తాసుగా అందుబాటులో ఈ విధవ సీతాలు జతకూడింది దిక్కూ మొక్కూ లేకుండా వీధులంటా పనిపాటా లేకుండా తిరుగుతూంటే తను వంటమనిషిని చేసిన వెధవ ముండ! సీతాలుకి కూడా పొగరెక్కినట్లుంది అనుకుంటూ తన గదిలోకి తిరిగి వచ్చేడతను

గదిలోకి అడుగిడటంతోనే సింహాచలం గుండెలు కూడా మంచంలోని వెంకటేశుకిమల్లే ఎగిరిపడసాగేయి ఉలికిపడుతూన్న కొడుకు దీనవదనాన్ని చూస్తూనే అతని నయనాలార్ద్రాలయ్యేయి

"ఎలా? ఎలా? ఏం చేయను? ఈ ముడుపునెలా కట్టను?" తలని అరచేతుల్లోకి జార్చేడతను మనసులో మంగళగిరి స్వామి ఉగ్రస్వరూపం విలయంతాండవం చేస్తూంటే మరోప్రక్క తాపంతో ఎగిసిపడుతూన్న వెంకటేశు ఉష్ణశరీరం అతడి హృదయాన్ని కలచివేస్తోంది

తరవాత అరగంటసేపు అతనెంత ప్రయత్నంచేసినా వెంకటేశు జ్వరం తగ్గుముఖం పట్టలేదు "బాబుగారు తెచ్చిన మందులు వేస్తేనన్నా తెరిపిస్తుందేమో?" అనుకుంటూ అనాలోచితంగానే నడవాలోకి వచ్చేడు సింహాచలం కాని యింకా శేషాద్రిగారి గదిలో వినిపిస్తూన్న సీతాలు అలికిడి అతని అడుగుని ముందుకి వేయనీయలేకపోయింది గాఢంగా నిట్టూరుస్తూ వెనుదిరిగేడతను.

"అయినా ఈ మందులేం పని చేస్తాయి? చినబాబు నేమందులాపగలిగేను? స్వామికి ముడుపుకట్టాలేకాని వెంకటేశు బట్టకట్టకమానడు!" అనుకుంటూ శేషాద్రిగారి ఆనందానికి అంతరాయం కలిగించలేక గదిలోకి అడుగువేసిన అతని వొంటిపై తేళ్ళూజెర్రీ పాకినట్లయింది. హఠాత్తుగా వెంకటేశులో తాపం అధికమయినట్లు తోచగానే సింహాచలం బెంబేలెత్తిపోయేడు కంగారుతో శేషాద్రిగారిని కేకేయబోయి అతి కష్టంగా ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడతను.

చేసేదేమీలేక మళ్ళీ తడిగుడ్డని వాడి నుదుటవేసి విసురుతూ కూచునిపోయేడు ఉన్నట్లుండి వెంకటేశులో కలవరింతలు ప్రారంభమయ్యేయి. దాంతో సింహాచలానికి చెమటలు పట్టసాగేయి.

మరో అరగంట గడిచింది. వెలుపల తొలికోడి కూసింది. కొడుకులో తాపం అధికమవుతూవుండటంతో యిహ ఉపేక్షించలేకపోయేడు సింహాచలం అతనికి శేషాద్రిగారు జ్ఞాపకం వచ్చేరు వారి వెంటే వారి గదిలోని సీతాలూ, సీతాలుని గురించి ఆలోచించగానే లచ్చీ, లచ్చి వెంటే కొబ్బరితోటా, కొబ్బరితోటలోని రాసిపడివున్న బొండాంల గుట్టా! దానికి తాను పెట్టుకుని వచ్చిన హద్దూ అన్నీ వరుసగా అతని స్మృతిపథంలో కదిలి వెళ్ళేయి.

"స్వామీ? నా కొడుకుని కాపాడు! నన్నన్యాయం చేయకు! నేనిపుడే వెళ్ళి నీ పేర ముడుపుని కట్టే ప్రయత్నం



చేస్తాను!" అంటూ రెండు చేతులూ ఎత్తి మంగళగిరి స్వామివి మనసారా వేడుకున్నాడు సింహాచలం

ఆ తర్వాత ఆ దేవుడి మహిమవల్లనో లేదా సింహాచలం రెండు గంటలనుంచి తడిగుడ్డతో పడిన శ్రమవల్లనో వెంకటేశుకి జ్వరం కొస్త జారినట్లయింది. ఎగిసిపడటం ఆగిపోయి నిద్రలోకి జారేడు. సింహాచలానికా సమయంలో మంగళగిరి స్వామిపై ఎనలేని గురి ఏర్పడింది. త్వరపడ్డాడతను. వెంకటేశుకి దుప్పటిని సవరించి గది తలుపుని చేరగిలవేసి నడవాలోకి అడుగువేసేడు. వెలుపల పుష్యమాసపు చలిగాలి స్వైరవిహారం చేస్తోంది

అపుడే శేషాద్రిగారి గదిలోనుంచి యివతలికి వచ్చిన సీతాలు, తనపైన పదిమణువుల బరువున్నదానిలా అడుగులో అడుగు వేసుకుంటూ నడవాని దాటి వెనుక పెరట్లోనున్న తన పాకపైపు వెడుతోంది

సింహాచలం నడిచేడు. కొబ్బరితోటలోకి రాగానే ముందు పాకదగ్గరికెళ్ళి తలుపుసందుల్లోంచి చూచేడు లోనికి.

చీకటిలో చిరుదీపం వెలుగుతోంది. ఆ వెలుగులో పాకలోని మంచంలో వంటరిగా వున్న కనకయ్య చేతిలోని చిన్న గుడ్డమూటతో ఏ దేవుడికో మొక్కుతూ కనిపించేడు

"కనకయ్యా!" పిలుస్తూనే తలుపుని త్రోసేడు సింహాచలం.

"ఓ నువ్వా బావా? రా! రా! నీసేతి సలువన నాకాలు నొప్పి తగ్గుతే బతికినంత కాలమూ నిన్ను నా గుండెల్లో దాచుకుంటాను. వెంకటేసుకెట్లా వుండాది? అన్నట్లు ఆడి నొదిలేసి యింత సందెటాశే ఎందుకొచ్చినట్లూ?"

"వాడికిపుడే కునుకు పట్టింది. లారీని అర్జెంటుగా పేటకి పంపాల్సిన పనుండి వచ్చాను కానీ చేతిలో ఏమిటా మూట"? అన్యమనస్కంగానే ప్రశ్నించేడు సింహాచలం

కనకయ్య సిగ్గుపడి పోయేడు

"నీ దగ్గర దాపరికవే వుండాది బావా? అపుడు సెట్టుమీంచి పడితేనేగద నా మగతనం పోయింది? యిపుడు రెండోతూరి పడ్డా! ఆ పోయింది తిరిగి రావాలని మొక్కుకుని దేవుడికి ముడుపు కట్టా!" అంటూ పాకలోని గోరంత దీపం వంక చూస్తూన్న కనకయ్య కళ్ళలో ఆశాదీపాలు మిణుకు మిణుకు మంటూ వుండటాన్ని గమనించేడు సింహాచలం.

"ముడు పే దేవుడికి కట్టేవ్?"

"సిన తిరపతి సామికి!"

"మంగళగిరి సామికి కాదు కదా? అయితే నీ కోరిక తీరుతుందిలే కనకయ బావా' యింతకీ లచ్చేది?"

అది వింటంతోనే కనకయ్య మొహం పాలిపోయింది అతను తలొంచుకోవటం చూచి విషయాన్ని గ్రహించి తలుపువంక నడిచేడు సింహాచలం,

తోటలోని మసక చీకట్లో ఆగివున్న లారీ లీలగా కనిపిస్తోంది. కేబిన్‌లో పానకాలు పీలుస్తోన్న బీడీనిప్పు రవ్వ ఎర్రగా మెరుస్తూండకం చూచి ఆ వంక నడిచేడు సింహాచలం

"మరి నాతో మా ఊరు రావటానికి నీ కిష్టమే కదా?" పానకాలు గొంతు వినిపించింది.

తను సమాధానం చెప్పక ముందే కేబిన్ తలుపు తెరుచుకోవటంతో పానకాలు వొళ్ళోంచి ఉలికిపడి లేచింది లచ్చి. ఎదురుగా సింహాచలాన్ని చూస్తూనే తెల్లబోయి వణికిపోతూ లారీ దిగిపోయి పాక వంక పరుగుదీసింది

"పానకాలూ! దూట'" అంటూ గత సాయంకాలం లారీతో శేషాద్రిగారు వెళ్ళాక రాసి పడిన బొండాల గుట్టవంక నడిచేడు సింహాచలం

రెండు నిముషాలపాటు సింహాచలం చెప్పిందేమిటో పానకాలు చెవికెక్కలేదు వాడు విన్నదల్లా లారీని తీసుకువెళ్ళి పేటలోని షాహుకారుకు సరుకునప్పగించి డబ్బును తేవటం మాత్రమే! వాడి బుర్ర నిండా లచ్చిని లేవదీసుకు పోవాలన్న ఆలోచనొక్కటే నిండి వుందా సమయంలో

ఇరువురూ కలిసి రాసిపడివున్న కాయల్లోని సగభాగాన్ని లారీలో నింపేరు ఆ పని జరుగుతున్నంత సేపూ వారి మనసులు వారి ఆధీనంలో లేవు పానకాలు గుండెనిండా లచ్చి దేవత్తై నిలిచిపోతే సింహాచలం గుండెలనిండా మంగళగిరి స్వామి గర్జిస్తూ నిలిచిపోయేడు.

లారీ కదిలి వెళ్ళగానే సింహాచలానికి భయంతో చలి ముంచుకువచ్చింది చీకటిలో ఏమీ తోచక పాకవంక నడిచేడు

లోనికొస్తోన్న సింహాచలాన్ని చూస్తూనే లచ్చి బిగుసుకుపోయి గోడనానుకు నుంచునిపోయింది

సింహాచలం తన మనస్సుని అదుపులోకి తెచ్చుకోగలిగేడు

"లచ్చీ? కనకయ్య మళ్ళీ చెట్టుపై నుంచిపడి పోయాడు. వాడి మగతనం వాడికి తిరిగి వస్తుంది తొందరపడి ఆ

పానకాలుని నమ్మి వెళ్ళిపోకు!"

లచ్చి బుర్రలో బాణాసంచా ప్రేలింది. కన్ను మలిగిన కనకయ్య వారి సంభాషణని ఆలకించలేదు.

ప్రక్కకి రెండడుగులు వేసి తలుపు వెనకాల వున్న పుల్లల్లోంచి పట్టెడన్ని అందుకుని వెలుపలికి వెళ్ళి చలిమంట వేసేడు సింహాచలం. ఆ మంటలవీ ఏవీ లేకుండానే పాకలోని లచ్చిబుర్ర వేడెక్కిపోసాగింది.

తూరుపు తెల్లవారకముందే లారీ తిరిగి వచ్చింది. పానకాలు ఓనోట్ల కట్టని సింహాచలానికి అందించేడు.

"పానకాలూ జాగ్రత్త! ఈ విషయం మూడో మనిషికి తెలియనీయవద్దు! ముఖ్యంగా బాబుగారికి! యిందు!" అంటూ కొన్ని నోట్లని వాడి చేతిలో కుక్కేడు సింహాచలం,

"నువ్వంతగా సెప్పాలా సిమ్మాసలం! కాని డబ్బు లెక్క చూచుకో!" అంటూ తన వాటా డబ్బుని జేబులో త్రోసుకుని బీడీ వెలిగించుకుంటూ పాకవంక చూచేడు పానకాలు.

తలుపుని త్రోసి గదిలోకి అడుగు పెడుతూనే వెంకటేశు వంక చూశాడు సింహాచలం. కొడి గట్టిన దీపం వత్తుల్లా వెంకటేశు గాజు కళ్ళు గదిలోని దీపం వెలుగులో మెరుస్తూన్నాయి. వాడు తండ్రి వంక బేలగా చూస్తూ ఏదో గొణిగేడు. వాడి గొంతు గర! గర! మనట వొక్కటే వినిపించింది సింహాచానికి.

మూలనున్న తన రేకు పెట్టె వైపు నడిచేడు సింహాచలం, పెట్టెని తెరిచి తాను వెంకటేశు చొక్కా కోసం కొని వుంచిన కొత్తగుడ్డల్లోంచి యింత ముక్కని బర్రు! మంటూ చింపేడు. తెచ్చిన నోట్లన్ని దాంట్లో కుక్కి ముడి వేస్తూ గోడకి తగిలించివున్న మంగళగిరి స్వామి పటం వంక నడిచేడు.

అంతదాకా తండ్రి ఏవైపు వెడితే అతికష్టంగా తలని త్రిప్పుతూ చూస్తూ వచ్చిన వెంకటేశు కళ్ళు సింహాచలం తన దగ్గరకు రాగానే క్షణం మెరిసేయి.

వాడి రెండు చేతుల్నీ ఎత్తి ముడుపు మూటని వాడి దోసిట వుంచి, అరమోడ్పు కనులతో మోకరిల్లి మంగళగిరి స్వామిని మననం చేసేడు సింహాచలం. కాని క్షణం తర్వాత కళ్ళు తెరిచి కొడుకు వంక చూచి గావు కేక వేసేడతను.

వెంకటేశు కళ్ళు తేలిపోయివున్నాయి. వాడి చిన్ననోరు తెరిచుకుని వుంది. ముడుపు గుడ్డవున్న దోసిలి బిగుసుకుపోసాగింది.

శేషాద్రిగారు గదిలోకి పరుగెత్తుకు వచ్చి నిశ్చేష్టులై నిలిచిపోయేరు.

ఆయన్ని కన్నీటి తెరలమధ్య చూస్తూ బావురుమన్నాడు సింహాచలం.

"బాబుగారూ! దొంగతనం చేసి కూడా ..." అంటూన్న సింహాచలానికి దగ్గుత్తిక పడిపోయింది. వెంకటేశు శరీరాన్ని మంచంలోంచి నేలకు దింపబోతూండగా వాడి దోసిలినుంచి జారిన ముడుపుమూట నేలమీద పడిపోయి దొర్లుతూ వెళ్ళి శేషాద్రిగారి పాదాలనంటి ఆగిపోయింది.

తెరిచివున్న తలుపుగుండా చలిగాలి రంయ్‌మంటూ వీచింది. గదిలోని చిరుదీపం గాలికి అల్లల్లాడుతూ ఆరిపోయింది. ***